సాక్షి ప్రకాశం
శనివారం । 10 । జూన్ । 2023



వైనాట్ 175తో చంద్రబాబుకు భయం

వైనాట్ 175 అన్న సీఎం జగన్ నినాదంతో చంద్రబాబు నాయుడుకు భయం పట్టుకుందని స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. - 8లో..



టీడీపీవి మతిలేని మాటలు

టంగుటూరు మండలంలో జరిగిన మహిళ హత్య కేసుపై టీడీపీ నేతలు మతిలేని మాటలు మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
43 /31

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే బాలినేని



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


ఒంగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. సీఎం సహాయనిధి చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే బాలినేని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ.4 లక్షల 40 వేల నిధుల చెక్కులను అందజేశారు. అల్లూరుకి చెందిన కలికివాయి కోటేశ్వరమ్మకు రూ.60 వేలు, ఒంగోలుకు చెందిన కట్ట సంగీతరావుకు రూ.2.50 లక్షలు, యర్ర మనోజ్‌కు రూ.1.30 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో గతం కంటే భిన్నంగా మంచి వసతులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే కార్పొరేట్ వైద్యాన్ని పేదల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. లబ్ధిదారులు మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.



చెక్కు అందుకుంటున్న కట్ట సంగీతరావు

అతివేగం.. మృత్యుపాశం..

అతివేగం..అజాగ్రత్త..నిర్లక్ష్యం..మద్య సేవనం..ఇలా ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు..తమ తప్పులేకున్నా ఎదుటివారి నిర్లక్ష్యానికి మరి కొందరు బలవుతున్నారు. ఇంటిని పోషించే పెద్దలు.. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు అర్ధంతరంగా తనువులు చాలిస్తున్నారు. నడిరోడ్డుపై నెత్తుటి ముద్దగా మారి విగతజీవులవుతున్నారు. ఆయా కుటుంబాలకు కడుపుకోతను మిగులుస్తున్నారు. మరి కొందరు శాశ్వత వికలాంగులుగా మారుతున్నారు.



- జిల్లాలో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు
- నిబంధనలు పట్టించుకోని వాహనదారులు
- ఆటో, మోటారు వాహనాల ప్రమాదాలే అధికం
- మూడు నెలల్లో 34 మంది దుర్మరణం

ఒంగోలు టౌన్:

అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా కొందరి నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో ప్రతి రోజూ ఎక్కడో అక్కడ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఆటోలు, మోటారు బైకులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. రెండు నెలలుగా ప్రమాదాల తీరును పరిశీలిస్తే ఏప్రిల్ నెలలో మొత్తం 16 ప్రమాదాలు సంభవించాయి. 15 మంది మృత్యువాత పడ్డారు. మే నెలలో 18 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈనెలలో ఇప్పటి వరకు 5 ప్రమాదాలు జరగ్గా ముగ్గురు మృతి చెందారు. వేగంగా వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం కూడా ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అలాగే మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎందరో పిల్లలు అనాథలవుతున్నారు. మరెంతో మంది తోడు కోల్పోయిన మహిళలు ఒంటరిగా మిగులుతున్నారు. అనేక మంది తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న ప్రమాదాలు

మొత్తం మీద పరిశీలిస్తే మోటారు బైకు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయి. ఆటో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కారు ప్రమాదాలు కూడా ఎక్కువగానే జరిగినట్లు ప్రమాదాలను గమనిస్తే తెలుస్తోంది. జాతీయ రహదారుల మీద ఏ వాహనమైనా వంద కిలోమీటర్ల వేగం తగ్గడం లేదు. దీంతో చిన్నపాటి ప్రమాదం జరిగినా పెద్ద నష్టమే జరుగుతోంది. వాహనాలు నుజ్జునుజ్జవుతున్నాయి. అందులో ప్రయాణిస్తున్న వారికి అత్యవసర చికిత్స చేసే అవకాశాలు కూడా లేకుండా పోతుంది. కాళ్లు చేతులు విరిగి ఏ పనీ చేయడానికి పనికిరాకుండాపోయిన వారి బతుకులు భారంగా మారుతున్నాయి. ఈ ప్రమాదాలతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజల జీవితాలు ఆర్థికంగా, హార్దికంగా నష్టపోతున్నారు.

మద్యం మత్తులో..

మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మే 20న కూచినపూడి శివారులో ఒక ఆటో ట్రాలీ బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. ట్రాలీ నడుపుతున్న డ్రైవర్ మద్యం తాగి ఉండడంతో వాహనం అతడి అదుపులో లేకుండా పోయింది. దాంతో ప్రయాణికులు భయపడినట్లుగానే బోల్తా పడింది. అదృష్టవశాత్తు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. జిల్లాలో పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం నో యాక్సిడెంట్ డే



మే 30న పెద్దారవీడు సమీపంలో మైనర్‌లు నడుపుతూ ప్రమాదానికి గురైన బైక్ (ఫైల్)



మే 28న త్రిపురాంతకం హైవే వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జయిన కారు (ఫైల్)

నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఆయా ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా కోర్టులో హాజరుపరిచి ఒకరోజు జైలు శిక్షలు పడేలా చేస్తున్నారు. అదేవిధంగా ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు మద్యం తాగి వాహనాలు నడపడం జరిగే నష్టాలు, కష్టాల గురించి అవగాహన కలిగిస్తున్నారు. అయినా కొందరు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు.

మైనర్ డ్రైవింగ్‌లతో చిక్కులు

మే నెల 30వ తేదీ పెద్దారవీడు సమీపంలో జరిగిన ప్రమాదాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పెద్దారవీడు గ్రామానికి చెందిన లక్కాకుల రజనీకాంత్ (14), కాయికాకులు అనేష్ (13)లు బైకు మీద రామాయపాలెం వెళ్లి బియ్యం తీసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఇంకొద్ది సేపట్లో ఇంటికి చేరుకుంటారనుకునేలోగా గ్రామ శివారులోని అంకాలమ్మ ఆలయం మూలమలుపు వద్దకు చేరుకోగానే మార్కాపురం నుంచి దోర్నాలకు ఇసుక లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గ మధ్యంలో వారు ప్రాణాలొదిలారు. గ్రామంలో విషాదం నెలకొంది. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని నెత్తినోరు బాదుకొని చెబుతున్నా కొందరు తల్లిదండ్రులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినవస్తున్నాయి.

తీవ్ర విషాదం మిగిల్చిన ప్రమాదాలు

మే 28వ తేదీ త్రిపురాంతకం మండలంలోని హైవే మీద జరిగిన రోడ్డు ప్రమాదం ఉలిక్కిపడేలా చేసింది. వేగంగా వస్తున్న కారు, బస్సు ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. తీవ్రంగా గాయపడిన మరొక యువకుడు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో జిల్లాలో విషాదం నింపింది. మృతుల కుటుంబాలు అంతులేని శోకంలో మునిగిపోయారు. గురువారం టంగుటూరు యం.నిడమానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి చెందడం కొత్తపట్నం మండలంలో విషాదం నింపింది. బేల్దారి పనులు చేసుకొని జీవితాన్ని గడుపుతున్న కోటి రత్నం , ఆమె కుమారుడు ప్రవీణ్, మేనల్లుడు దిలీప్ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు.

నిబంధనలు బేఖాతర్..

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్పీ మలికా గర్గ్ అనేక సార్లు సూచనలు చేస్తున్నారు. పోలీసు అధికారులు సైతం వాహనదారులకు అనేక జాగ్రత్తలు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలని చెబుతున్నా బేఖాతరు చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదామని హెచ్చరిస్తున్నా వినేవారు లేరు. ఏదేమైనా ప్రమాదం జరిగినప్పుడు నాలుగు రోజులు రూల్స్ పాటించడం తరువాత వదిలేయడం మామూలై పోయింది. ఇంటి నుంచి బయటకు బయలుదేరేటప్పుడు మన కోసం మన కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారన్న ఆలోచన ఉంటే తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ ప్రధాన కూడళ్లలో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేయడం, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేయడం లాంటి అనేక చర్యలు తీసుకుంటున్నాం. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు హైవేల మీద నిత్యం గస్తీని ఏర్పాటు చేయడంతో పాటుగా తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

– వి.శ్రీనివాసరావు,
ట్రాఫిక్ డీఎస్పీ, ఒంగోలు

రాయితీ పరికరాలు సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ దినేష్ కుమార్
- కొణిజేడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



కొణిజేడులో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

టంగుటూరు: ప్రభుత్వం అత్యధిక రాయితీతో అందిస్తున్న యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. వాటర్‌షెడ్ కాంపోనెంట్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజనలో భాగంగా ఉత్పాదకత పెంపుదల నిధులతో కొణిజేడు, మర్లపాడు, కందులూరు గ్రామాలకు మొదటి విడతగా రూ.49 లక్షల విలువైన వ్యవసాయ సంబంధిత పనిముట్ల పంపిణీ చేపట్టారు. డ్వామా పీడీ శీనారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ దినేష్ కుమార్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శుక్రవారం కొణిజేడులో పనిముట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2021–22 ఆర్థిక సంవత్సరానికి ప్రకాశం జిల్లాకు డబ్ల్యూడీసీపీఎంకేఎస్‌వై కింద ఎనిమిది ప్రాజెక్టులు మంజూరు చేసిందన్నారు. మొత్తం 8 మండలాల్లోని 40 గ్రామ పంచాయతీల్లో 4 వాటర్ షెడ్ సెంటర్లు మంజూరయ్యాయని చెప్పారు. అందులో టంగుటూరు మండలం కొణిజేడు ప్రాజెక్టు కింద కొణిజేడు, కందులూరు, మర్లపాడు గ్రామ పంచాయతీలకు వాటర్ షెడ్ మంజూరైనట్లు తెలిపారు. వీటికయ్యే ఖర్చును 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయన్నారు. కొణిజేడు మైక్రోవాటర్ షెడ్‌కు 1772 హెక్టార్ల భూమికి రూ.389.84 లక్షలు, కందులూరు మైక్రోవాటర్ షెడ్‌కు 1106 హెక్టార్ల భూమికి గాను రూ.243.32 లక్షలు, మర్లపాడు మైక్రోవాటర్ షెడ్‌కు 788 హెక్టార్ల భూమికి గాను రూ.173.36 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ డబ్బును 3 నుంచి 5 సంవత్సరాల్లోపు కేటాయింపుల ప్రకారం ఖర్చు చేయాల్సి ఉందన్నారు. భూగర్భ జలాలు పెరిగేలా, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా అమలవుతున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అత్యధిక సబ్సిడీపై పనిముట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఓసీలు అయితే 20 శాతం, ఇతర కులాల వారికి అయితే 10 శాతం చొప్పున భరిస్తే మిగతా డబ్బును రాయితీ ఇస్తూ వారికి అవసరమైన పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

కొణిజేడు గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా పాటుపడతా ...

వ్యక్తిగతంగా కొణిజేడు గ్రామస్తులకు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని, గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా పాటుపడతానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతులకు అత్యధిక సబ్సిడీపై పనిముట్లకు మిగిలిన 10–20 శాతం వాటాను కూడా భరించడానికి రైతులు ఇబ్బంది పడితే వారి తరపున తానే ఆ డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పథకంలో భాగంగా రూ.2.70 కోట్ల నిధులతో గ్రామంలో త్వరలోనే 20 పడకలతో మెగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయ భవనాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం సామాన్య బడుగు, బలహీన వర్గాలకు 24 గంటలు అందుబాటులో వైద్య సేవలు ఉండాలనే సదుద్దేశంతో పీహెచ్‌సీలు నిర్మిస్తోందని, వీటిలో ప్రజలకు అవసరమైన వివిధ రకాల రక్త పరీక్షలు, మందులు అందిస్తుందని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే ప్రైవేటు స్థలాలను గుర్తించి, వాటిని కొనుగోలు చేసేందుకు కూడా అవసరమైతే తానే డబ్బులు ఇస్తానని ప్రకటించారు. పది రోజుల్లో వీటికి శంకుస్థాపన చేసేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ బాలినేని సహకారంతో న్యాయపరంగా అడ్డంకులు ఎదురైనా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి కొణిజేడు అభివృద్ధికి, ఇళ్ల పట్టాల పంపిణీకి కృషి చేస్తామని తెలిపారు.

అనంతరం కొణిజేడు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి శిలాఫలకాన్ని కలెక్టర్ దినేష్ కుమార్, బాలినేని శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2.30 లక్షల విలువైన మూడు కె.డబ్ల్యూ.పీ.గ్రిడ్ల అనుసంధానిత ఒక సోలార్ ఇన్వర్టర్ యూనిట్, రూ.2.65 లక్షల విలువైన 18 వాట్ల సామర్థ్యం కలిగిన 10 సోలార్ ఎల్ఈడీ వీధి దీపాల వ్యవస్థను కూడా ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ జలకళ, వాటర్ షెడ్ విభాగ జాయింటు కమిషనర్ జగన్నాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సాగర్‌రెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, ఈదా వెంకటరెడ్డి, సర్పంచి గుంజి వెంకయ్య, ఎంపీటీసీ బుర్రా అంకరాజు, సొసైటీ అధ్యక్షుడు బాలినేని వెంకటేశ్వరరెడ్డి, బాలినేని బాల కృష్ణారెడ్డి, సింగమనేని బ్రహ్మయ్య, ఈదర అమర్నాథ్, ఉప్పలపాటి రామరాజు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ:

తొలుత సచివాలయాన్ని కలెక్టర్ దినేష్ కుమార్ తనిఖీ చేసి, సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు.



కొణిజేడు ప్రభుత్వ పాఠశాలలో సోలార్ ఇన్వర్టర్ యూనిట్‌ని ప్రారంభిస్తున్న బాలినేని, కలెక్టర్





సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు

ఒంగోలు సబర్బన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్. కృష్ణారెడ్డి, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ కమర్షియల్ ట్యాక్స్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్ సీఎంను కలిశారు.

నవరత్నాల అమలుతో సుస్థిరాభివృద్ధి



సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మాల్లాది విష్ణు

- ప్రభుత్వ లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించాలి
- రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు

ఒంగోలు అర్బన్: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో నవరత్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానం చేసిందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవరత్నాలను సమర్థవంతంగా అమలు చేయడంతో సుస్థిరాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. నవరత్నాల కార్యక్రమాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఏ నారాయణమూర్తితో కలిసి జిల్లాకు వచ్చిన ఆయన శుక్రవారం స్పందన భవనంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, 8 ప్రాధాన్యతా సూచీల పురోగతిపై కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో విష్ణు మాట్లాడుతూ నవరత్న పథకాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా జిల్లాను అన్నీ రంగాల్లో అగ్రగామిగా ఉండేలా అధికారులు పనిచేయాలన్నారు. బైజూస్ పాఠాలు, నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యా కానుక, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ వంటి పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు బాల్య వివాహాలు నివారించడం, పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ లేకుండా చేయడం వంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. మెరుగైన విద్య, వైద్యం అందించడంతో పాటు పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో 65.3 శాతం మంది చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత ఉండేదని ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 53.7 శాతానికి తగ్గిందన్నారు. ఏడాది లోపు చిన్న పిల్లల్లో ఐఎంఆర్ రేటు గతంలో వెయ్యిలో 60 మంది చనిపోతే ఇప్పుడు 25కు తగ్గినట్లు తెలిపారు. ప్రసవ సమయంలో తల్లుల మరణాల రేటు ప్రతి లక్ష మందిలో గతంలో 100 ఉంటే నేడు 45 కంటే తక్కువగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలతో క్లీన్ ఎనర్జీలో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచినట్లు వివరించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం కలిగిన పథకాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ రాష్ట్రం అన్నీ విధాలుగా అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి దూర దృష్టితో పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ మెరుగైన విద్య, వైద్యం అందించడంతో పాటు జిల్లాలోని బాలలు, గర్భిణులు, బాలింతల్లో రక్త హీనత నివారించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో ఉండేలా ప్రత్యేక సర్వే చేయిస్తున్నామన్నారు. డ్రాప్ అవుట్స్ లేకుండా పక్కాగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కుటుంబాలతో సహా వలస వెళ్తున్న సందర్భాల్లో పిల్లలను అక్కడి పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన బాలికలు పై తరగతుల్లో చేరేలా బాలికా వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారించేందుకు తీసుకుంటున్న ఆహార వివరాలను ఐసీడీఎస్ ద్వారా సర్వే చేయిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి సచివాలయంలో ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి స్థానికంగా జరుగుతున్న వివాహాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. మండల స్థాయిలో ప్రతి వారం ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు



గెలుపు కోసం బండ లాగుతున్న ఎడ్లు

రాజంపల్లి (పెద్దారవీడు): మండలంలోని రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత గొట్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పశు బలప్రదర్శన పోటీలు మూడు రోజులు హోరాహోరీగా సాగి సీనియర్ విభాగంతో శుక్రవారం ముగిశాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చవటపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్రబాబుల్‌రెడ్డి ఎడ్లు 2632 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సాకేత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సామిరెడ్డిల ఎడ్లు 2250 అడుగులు లాగి రెండో స్థానం, నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన గొటికె రవితేజేశ్వరరెడ్డి ఎడ్లు 1789 అడుగులు లాగి మూడో స్థానం, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి, సత్తెవల్లి బాలరాజు కలిసి ఎడ్లు 1509 అడుగులు లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. దాతలు రాజంపల్లి గ్రామానికి చెందిన ఏర్వ శ్రీనివాసరెడ్డి మొదటి బహుమతి రూ.75 వేలు, శ్రీశైలానికి చెందిన మూల దశరథరెడ్డి రెండో బహుమతి రూ.50 వేలు, గుంటూరుకు చెందిన ఏడీఎం ఎంటర్ ప్రైజెస్, చిల్లీస్ కమిషన్ ఎంజెంట్స్ మూడో బహుమతి రూ.30 వేలు, పోతంపల్లి గ్రామానికి చెందిన నలదిమ్ము వెంకటేశ్వరరెడ్డి నాల్గవ బహుమతి రూ.20 వేలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా సీహెచ్ శ్రీరామిరెడ్డి, ఉయూరు సాంబిరెడ్డి, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, వెన్నా బోడిరెడ్డి, జీ రామిరెడ్డి వ్యవహరించారు.

12న అండర్ 7, 9 చెస్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో రిమ్స్ వేదికగా ఈనెల 12న అండర్ 7, అండర్ 9 విభాగాల్లో ఓపెన్, బాలికలకు వేరువేరుగా చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా చెస్ సెక్రటరీ షేక్ అబ్దుల్ నబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు పూర్తి వివరాలకు సెల్ 9494427319 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రకాశం ఇన్‌చార్జి ఎస్పీగా తిరు మల్లేశ్వరరెడ్డి

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ తిరు మల్లేశ్వరరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఎస్పీ మలికా గర్గ్ శనివారం, ఆదివారం రెండు రోజులు పాటు సెలవు తీసుకోవడంతో ఈ రెండు రోజుల పాటు మల్లేశ్వర రెడ్డి ఇన్‌చార్జి ఎస్పీగా వ్యవహరించనున్నారు.

క్లుప్తంగా

టూవీలర్‌ను ఢీకొన్న అడవి పంది

● తీవ్రగాయాలతో వ్యక్తి మృతి


మృతి చెందిన దిబ్బారెడ్డి

మార్కాపురం: టూవీలర్‌పై వెళ్తుండగా అడవి పంది ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మార్కాపురం మండలంలోని ఇడుపూరు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఇడుపూరు గ్రామానికి చెందిన యక్కంటి దిబ్బారెడ్డి(45) తన టూవీలర్‌పై మార్కాపురం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అకస్మాత్తుగా అడవి పంది అడ్డురావడంతో టూవీలర్ అదుపు తప్పి పడిపోయింది. తీవ్రంగా గాయపడిన దిబ్బారెడ్డి మార్కాపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వాకర్..

దర్శి: వాకింగ్ చేస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటన దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దర్శి పట్టణానికి చెందిన భీమవరపు కోటిలింగం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన కోటి లింగాన్ని స్థానికులు గమనించి దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు..

ఒంగోలు టౌన్: ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ మీద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు శుక్రవారం గుర్తించారు. రాపర్ల–ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై 30 ఏళ్ల వయసున్న ఓ యువకుడు మరణించి ఉన్నాడు. మృతుడు నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి వద్ద ఆధారాలేవీ లభ్యం కాలేదు. ఒంగోలు జీఆర్పీ ఎస్‌ఐ పి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9490566577ను సంప్రదించాలని ఎస్సై కోరారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత కొమరోలు జట్టు


విజేతలను అభినందిస్తున్న కురిచేడు ఎస్సై

కురిచేడు: స్థానిక వైఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో కొమరోలు జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కురిచేడు–కొమరోలు టీంలు తలపడ్డాయి. ఆట ముగిసే సరికి కొమరోలు ఎఫ్ఎస్ టీం 6 గోల్స్ చేసి విజేతగా నిలిచింది. కురిచేడు డీఎస్‌జే టీం రన్నరప్‌గా నిలవగా కురిచేడు బీవీఎల్ టీమ్ తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. మొదటి బహుమతి రూ.20 వేలు, కప్‌ను దేవతి నాగేంద్రబాబు, ద్వితీయ బహుమతి రూ.10 వేలతోపాటు కప్‌ను జానపాటి పవన్ కుమార్, తృతీయ బహుమతి రూ.5 వేలు, షీల్డ్‌ను కంభంపాటి సాయన్న సమకూర్చగా జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, ఎస్సై ఎం.దేవకుమార్ చేతులమీదుగా అందజేశారు.

టీడీపీవి మతిలేని మాటలు

- హనుమాయమ్మ మరణాన్ని వైఎస్సార్ సీపీపై నెట్టడం దుర్మార్గం
- నిందితుడు, బాధితుడు ఇద్దరూ సోదరులు.. పైగా టీడీపీ సానుభూతిపరులు
- దళిత మహిళగా వంగలపూడి అనిత వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- ఎమ్మెల్యే డోలా మరుగుదొడ్ల స్కామ్‌ను కప్పిపుచ్చేందుకే ఈ డ్రామాలు
- ఎల్లో మీడియాలో అసత్యాలు అచ్చువేయడం సిగ్గుచేటు
- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు ధ్వజం


పొన్నలూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

పొన్నలూరు: టంగుటూరు మండలం రావివారిపాలెం గ్రామంలో రెండు కుటుంబాల మధ్య వివాదం నేపథ్యంలో దళిత మహిళ సవలం హనుమాయమ్మ హత్యకు గురైన ఘటను టీడీపీ నేతలు రాజకీయం చేయడమే కాకుండా మతిభ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. పొన్నలూరులో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించిన అశోక్‌బాబు.. టీడీపీ నాయకుల ఆరోపణలను తిప్పికొట్టారు. భూ వివాదం, కుటుంబ గొడవల నేపథ్యంలో హత్య జరిగితే టీడీపీ నాయకులు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని రోజుకో విధంగా వార్తలు రాయిస్తూ బాధిత కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే స్వామి చేసిన మరుగుదొడ్ల అవినీతి కంపు రాష్ట్రమంతా వ్యాపించడంతో రోజుకో టీడీపీ నేతను పిలిపించి నిరాధారమైన ఆరోపణలు చేయించడమే కాకుండా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అభాండాలు వేయిస్తున్నాడని దుయ్యబట్టారు. నిందితులు, బాధితులు ఇద్దరూ అన్నదమ్ములని, పైగా టీడీపీ సానుభూతిపరులని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరిని అడిగినా ఇరువురి నేపథ్యం చెబుతారన్నారు. హనుమాయమ్మ మరణానికి రాజకీయ రంగు పులిమి శవ రాజకీయాలు చేయడానికి ఎమ్మెల్యే స్వామి తహతహలాడుతున్నాడన్నారు.

దళితుల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని చంద్రబాబు, దళితులు ఏం పీకుతారని లోకేష్ అన్నారని, అసలు దళితల గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. దళిత మహిళగా వంగలపూడి అనిత వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. చంద్రబాబు, లోకేష్ అహంకార పూరిత, పెత్తందారి మాటల వల్ల దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయి కాబట్టే మంత్రి సురేష్ చొక్కా విప్పి నిరసన తెలియజేశారన్నారు. టీడీపీ నాయకుల మాటలతో గాయపడిన దళితుల మనసులను చూడాలి గాని, వారి కండలను ప్రస్తావిస్తూ సోదరి అనిత మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. దళితులపై ప్రేమ ఒలకబోస్తున్న ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య, టీడీపీ నాయకులు టంగుటూరు మండలం నిడమనూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దళితులు రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారి కటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు.

స్వామి, సత్య అక్రమాలు మరిన్ని బయటపెడతాం

హనుమాయమ్మ మరణాన్ని రాజకీయ హత్యగా చూపించి, మరుగుదొడ్ల స్కామ్‌ను పక్కదోవ పట్టించాలని చూస్తున్న ఎమ్మెల్యే స్వామి, షాడో ఎమ్మెల్యే దామచర్ల సత్య అవినీతి, అక్రమాలను మరిన్న బయటకు తీస్తామని అశోక్‌బాబు పేర్కొన్నారు. మరుగుదొడ్ల స్కామ్‌పై త్వరలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే స్వామి అవినీతిని నియోజకవర్గ ప్రజల ముందు ఉంచి, వారే తన్నే విధంగా చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేతల మధ్య చిన్నపాటి పొరపొచ్చాలను ఎల్లో మీడియా సాయంతో బూతద్ధంలో చూపుతూ టీడీపీ నేతలు శునాకానందం పొందుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఒకే కుటుంబమని, సమయం వచ్చినప్పుడూ అందరు ఏకతాటిపైకి వచ్చి ఎమ్మెల్యే స్వామికి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిరుపతిరెడ్డి, దద్దాళి మల్లికార్జున, గొలపూడి రమణయ్య, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

- ఈతముక్కల, ఎం.నిడమానూరులో మిన్నంటిన రోదనలు
- కడచూపు కోసం కదిలొచ్చిన బంధువులు


కోటిరత్నం, ప్రవీణ్ కుమార్ అంతిమ సంస్కారం నిర్వహిస్తున్న బంధువులు

కొత్తపట్నం/టంగుటూరు: టంగుటూరు మండలం ఎం.నిడమానూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి అంత్యక్రియలు శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. గురువారం సాయంత్రం ఎం.నిడమానూరు–మర్లపాడు గ్రామాల మధ్య బైక్ ఆపి రోడ్డు పక్కన నిల్చున్న తల్లీకొడుకు, ఆ మహిళ మేనల్లుడిని మినీ వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. వివాహానికి హాజరై తిరిగి వెళ్లే క్రమంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందడంతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. కాగా ముగ్గురి మృతదేహాలకు ఒంగోలు జీజీహెచ్‌లో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

☛ కొత్తపట్నం మండల ఈతముక్కల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన బందేల కోటిరత్నం, బందేల ప్రవీణ్ కుమార్ మృతదేహాలను చూసేందుకు బంధువులతో పాటు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలివచ్చారు. తల్లి, తమ్ముడు కావాలంటూ కుమార్తె లక్ష్మీప్రసన్న కుమారి బోరున విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. భార్య, కుమారుడి మృతదేహాలపై పడి రోదిస్తున్న బందేల సురేష్‌ను ఓదార్చడం బంధువులెవరికీ సాధ్యపడలేదు. క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

☛ టంగుటూరు మండలం ఎం.నిడమానూరు యువకుడు మేళం దిలీప్‌కుమార్(22) మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. దిలీప్ అంత్యక్రియలకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శుక్రవారం రాత్రికి దహన సంస్కారాలు పూర్తి చేశారు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య జీజీహెచ్‌లో దిలీప్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.


దిలీప్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వై నాట్ 175తో చంద్రబాబుకు భయం

- వైఎస్సార్ సీపీ, టీఆర్ఎస్, కర్ణాటక మ్యానిఫెస్టోలను బాబు కాపీ కొట్టి విఫలమయ్యాడు
- 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తథ్యం
- ఏపీ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు


మీడియాతో మాట్లాడుతున్న మల్లాది విష్ణు

ఒంగోలు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కాగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పూర్తి విశ్వాసంతో వై నాట్ 175 అనే నినాదం తీసుకోవడంతో చంద్రబాబుకు భయం పట్టుకుందని ఏపీ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన స్పందన భవనంలో నవరత్నాలు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఏ నారాయణమూర్తి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌లతో కలిసి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, ప్రియారిటీ ఇండికేటర్స్‌పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చిన్న పిల్లల ఆరోగ్య రక్షణ, గర్భిణులు, బాలింతలు, శిశు మరణాలను అరికట్టేందుకు తీసుకున్న చర్యలతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. పేదరిక నిర్మూలన, విద్యా, వ్యవసాయం, వైద్యం రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలోని అంశాలను వివరించారు.

గతంలో పలుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నవరత్నాలు ఎందుకు ప్రవేశపెట్టలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ నవరత్నాలు, టీఆర్ఎస్ పార్టీలో కొన్ని, కర్ణాటకలో మ్యానిఫెస్టోలోవి మరికొన్ని కాపీ కొట్టి చంద్రబాబు మ్యానిఫెస్టో అని విడుదల చేయడం హాస్యాస్పదం అన్నారు. కాపీ కొట్టిన మ్యానిఫెస్టోతో చంద్రబాబు విఫలమై నవ్వులపాలయ్యాడన్నారు. వైఎస్ జగన్ నవరత్నాలు అమలు చేస్తుంటే రాష్ట్రం అప్పుల పాలై శ్రీలంక అవుతుందని బుకాయించిన చంద్రబాబు ఇప్పుడు అవే పథకాలను ఆయన మ్యానిఫెస్టోగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్థిక కష్టాలు ఉన్నా ఇచ్చిన మాటల మేరకు జగన్ నవరత్నాలను అమలు చేశారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్య, వ్యవసాయం, వైద్యం, గృహాల గురించి పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఒక మాట, అధికారం వచ్చాక మరో మాట చెప్పడం ప్రజలకు తెలియంది కాదని, ఆయన్ను నమ్మే పరిస్థితులు రాష్ట్రంలో లేవన్నారు. పవన్‌కళ్యాణ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ వీకెండ్ పర్యటనలు పట్టించుకోమన్నారు. సిద్ధాంతం, ఎజెండాలు లేని పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ పాదయాత్రలు వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేవన్నారు. రాష్ట్రంలో 55 శాతానికిపైగా ప్రజలు జగన్‌తో ఉన్నారని, అందుకు మున్సిపాలిటీ, జెడ్పీ, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు పక్కా తీర్పును ఇవ్వడమే నిదర్శనమన్నారు. పవన్‌కళ్యాణ్ అమితాబ్‌తో కలిసినా, అమిత్‌షాతో కలిసినా ఒరిగేదేమీ లేదన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మార్కాపురంలో మత్స్య శాఖ–బెస్ట్ ఫ్రెష్ ఫ్రైస్‌కో బ్రాండింగ్ తొలి స్టోర్ ప్రారంభం


ఫిష్ ఆంధ్రా డైలీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ, సబ్ కలెక్టర్ సేథు మాధవన్

మార్కాపురం: రాష్ట్రంలో మత్స్యకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో మత్స్య శాఖ సహకారంతో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ డైలీ స్టోర్‌ను సబ్ కలెక్టర్ సేథు మాధవన్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేపలను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు విక్రయించేకునే అవకాశం ఫిష్ ఆంధ్రా సెంటర్లతో కలుగుతుందన్నారు మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్స్య శాఖ–బీఎఫ్ఎఫ్ (బెస్ట్ ఫ్రెష్ ఫ్రైస్) కో బ్రాండింగ్‌గా జిల్లాలో మొదటి స్టోర్‌ను మార్కాపురంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో రూ.2 లక్షలు లబ్ధిదారుని వాటా, రూ.2 లక్షలు బ్యాంక్ రుణం కాగా మిగిలిన రూ.6 లక్షలు మత్స్య శాఖ సబ్సిడీగా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కంభం ఏడీ షేక్ మహమ్మద్ సుభాని, ఫిషరీస్ అసిస్టెంట్ కరీంబాషా, నూతలపాటి లలిత, జంకె శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేక పుట్టించిన టుబాకో

- ఒంగోలు రీజియన్ పరిధిలో ఆల్‌టైమ్ గరిష్ట ధరలు నమోదు
- ఒంగోలు–2 వేలం కేంద్రంలో కేజీ రూ.229
- కొండపిలో రూ.228, టంగుటూరు, కందుకూరులో రూ.227, మద్దిపాడులో రూ.226
- ఆనందం వ్యక్తం చేస్తున్న పొగాకు రైతులు


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

ఒంగోలు రూరల్/కొండపి/టంగుటూరు/మద్దిపాడు/కందుకూరు: పొగాకు ధరలు ఒక్కసారిగా పైకి ఎగబాకాయి. నాణ్యమైన హై గ్రేడ్ పొగాకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడటంతో రైతుల పంట పండింది. శుక్రవారం ఒంగోలు రీజియన్ పరిధిలోని అన్ని వేలం కేంద్రాల్లో ఆల్ టైమ్ గరిష్ట ధరలు నమోదు కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. నిన్నటి వరకూ ముక్క, చూరను కూడా కేజీకి రూ.200 వరకు చెల్లించి కొనుగోలు చేసిన కంపెనీలు శుక్రవారం హైగ్రేడ్ పొగాకు కనిపించగానే ధరలు అమాంతం పెంచాయి. పొగాకు కంపెనీల్లో పెద్దన్నగా ఉండే ఐటీసీ ముందుండి హైగ్రేడ్ రకం ధర పెంచడం ద్వారా వ్యాపారుల సిండికేట్‌ను బ్రేక్ చేయడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా పొగాకు ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణమని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. ఐటీసీతోపాటు ఇతర కంపెనీల ప్రతినిధులు పోటీ పడుతుండటంతో ధర ఇంకా పెరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

☛ ఒంగోలు–2 వేలం కేంద్రంలో అత్యధికంగా కేజీ రూ.229 ధర పలికింది. ఈ కేంద్రానికి వివిధ గ్రామాల రైతులు 427 బేళ్లు తీసుకురాగా వ్యాపారులు 414 కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.213.25 నమోదైందని వేలం నిర్వహణాధికారి కె.రామకృష్ణ తెలిపారు.

☛ కొండపి వేలం కేంద్రంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ.228 పలికింది. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాల రైతులు 728 బేళ్లు వేలానికి ఉంచగా 686 కొనుగోలయ్యాయి. అత్యల్ప ధర కేజీ రూ.150, సరాసరి ధర రూ.214.97 రైతులకు దక్కిందని వేలం నిర్వహణాధికారి రామారావు తెలిపారు.

☛ టంగుటూరు వేలం కేంద్రానికి టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాల రైతులు 959 బేళ్లు తీసుకురాగా 940 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.227, కనిష్ఠ ధర రూ.161, సరాసరి ధర రూ.220.16 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

☛ మద్దిపాడు మండలం వెల్లంపల్లి వేలం కేంద్రంలో హైగ్రేడ్ రకం పొగాకును కేజీ రూ.226కు కొనుగోలు చేశారు. బేళ్ల సంఖ్య పెరిగి ఉన్నట్లయితే ఇంకా ఎక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేసేవారని వేలం నిర్వహణాధికారి తెలిపారు.

☛ కందుకూరు–1వ వేలం కేంద్రంలో 759 బేళ్లను విక్రయానికి ఉంచగా 708 బేళ్లు, కందుకూరు–2లో 653 బేళ్లకుగాను 575 బేళ్లు అమ్ముడుపోయాయి. రెండు వేలం కేంద్రాల్లోనూ కేజీ పొగాకు గరిష్ఠ ధర రికార్డు స్థాయిలో రూ.227గా నమోదైంది. కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.219 పలికింది.

కేంద్రం దృష్టికి పొగాకు రైతుల సమస్యలు

● బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

పొదిలి రూరల్: పొగాకు రైతులు సమస్యలను కేంద్రం దృష్టి తీసుకెళ్తానని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. వేలం కేంద్రం నిర్వాహణాధికారి కిరణ్‌తో మాట్లాడి మార్కెట్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నాటకలో అదనపు పొగాకుకు పెనాల్టీ లేకుండా రైతులు అమ్ముకునేలా తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ ఏడాది పొగాకు ధరలపై రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.